


సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4,808 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 525 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ముప్పాళ్ల: చాగంటివారి పాలెం ఎస్టీ కాలనీలో టీటీడీ ఆధ్వర్యంలో భూ సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. టీటీడీ వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

న్యూస్‌రీల్

పల్నాడులో 47.86 శాతం పింఛన్ల పంపిణీ



నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక బుధవారం జిల్లాలో 47.86 శాతం పంపిణీ చేశారు. ఈనెల 2,81,268 మందికి రూ.78,07,27,750లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా తొలిరోజు 1,34,625 మందికి రూ.37,39,16,750లను అందజేశారు.

యార్డుకు 35,478 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 35,478 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 35,076 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,800 నుంచి రూ.22,800 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,899 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

నాగార్జునకొండ సందర్శన



విజయపురిసౌత్: ప్రపంచంలోని 12 దేశాల బుద్దిస్ట్ స్కాలర్స్ బుధవారం నాగార్జునకొండను సందర్శించారు. ఈ సందర్భంగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ సీనియర్ ప్రోగ్రాం డైరెక్టర్ సునిల్‌కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు బౌద్ధమత వాసనలు కలిగిన 12 దేశాలకు సంబంధించిన బుద్దిస్ట్ స్కాలర్స్ బుద్ధ భూమి వందన యాత్ర పేరుతో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా భారతదేశంతో పాటు థాయిలాండ్, తైవాన్, కంబోడియా, శ్రీలంక, మలేషియా, భూటాన్, జపాన్, లావ్స్, వియత్నాం, సౌత్‌కొరియా, నేపాల్ దేశాల బుద్దిస్ట్‌స్కాలర్స్ ఈ సెమినార్లలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విషయ సేకరణలో భాగంగా భారతదేశంలోని బౌద్ధకేంద్రాలైన బుద్ధగయ, వారణాసి, సారనాథ్, ఔరంగాబాద్, అజంతా లాంటి ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను సందర్శిస్తూ నాగార్జునకొండను సందర్శించారని తెలిపారు. మొదటగా 33 మందితో కూడిన బృందం నాగార్జునకొండకు లాంచీలో వెళ్లారు. అక్కడ పునర్నిర్మితమైన కట్టడాలు, మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధుని ధాతువు, సింహళవిహార్, మహాస్థూపాన్ని సందర్శించారు. వీరికి టూరిజం గైడ్ సత్యనారాయణ చారిత్రక విశేషాలను వివరించారు.

బోధనేతర సిబ్బంది వయోపరిమితి పెంచాలి

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బంది ఉద్యోగ విరమణ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేటిగడ్డ వెంకటప్పారెడ్డి ఏపీ ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీ జవహర్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ఆధ్వర్యంలో వెంకటప్పారెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులు బుధవారం చీఫ్ సెక్రటరీని కలిశారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఈ నిర్ణయాన్ని యూనివర్సిటీల్లోని అధ్యాపకేతర సిబ్బందికి కూడా వర్తింపజేయాలని కోరారు. దీనికి చీఫ్ సెక్రటరీ స్పందిస్తూ పదవీ విరమణ వయోపరిమితి పెంపును యూనివర్సిటీ అధ్యాపకేతర సిబ్బందికి కూడా వర్తింపజేస్తామని హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు.

ఉన్నత శిఖరాలెక్కేస్తాం

గణితమంటే భయం పోయే
- "సాక్షి" మ్యాథ్స్ బీకి విశేష స్పందన
- గుంటూరు నగరంలోని పాఠశాలల్లో పరీక్ష
- ఉత్సాహంగా పాల్గొన్న 338 మంది విద్యార్థులు



గోరంట్ల విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో గణితశాస్త్రంపై నెలకొన్న భయాన్ని దూరం చేసి, కఠినమైన లెక్కలను సులువుగా పరిష్కరించే నైపుణ్యాన్ని అందించేందుకు ''సాక్షి'' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మ్యాథ్స్ బీ పరీక్ష విజయవంతమైంది. విద్యార్థుల్లో ధైర్యాన్ని నూరిపోసింది. సులువుగా లెక్కలు చేసే విధానం, కూడికలు, తీసివేతలు తదితర అంశాలపై నిపుణులైన ఉపాధ్యాయులతో తయారు చేసిన ప్రశ్నపత్రం అందరినీ ఆలోచింపజేసింది. ఫలితంగా 'గణితం సులువే.. ఉన్నత శిఖరాలెక్కేస్తాం' అంటూ చిన్నారులు నినదించారు. గుంటూరు నగర పరిధిలో అరండల్‌పేటలోని కెనడీ, గోరంట్లలోని విజేత, నవభారత్‌నగర్‌లోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లతోపాటు, విజ్ఞాన్ హైస్కూల్లో 'సాక్షి' మ్యాథ్స్ బీ పరీక్ష అట్టహాసంగా జరిగింది. ఈ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 338 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను నాలుగు విభాగాలుగా విభజించి, ఆయా పాఠ్యాంశాల స్థాయిలో రూపొందించిన ప్రశ్నపత్రాలతో పరీక్ష నిర్వహించారు. పాఠశాలస్థాయిలో నిర్వహించిన మ్యాథ్‌బీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా, రీజినల్ స్థాయికి ఎంపిక కానున్నారు.



విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కెనడి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పరీక్ష రాస్తున్న చిన్నారులు

భయం పోయింది



గణితంపై భయాన్ని దూరం చేయడంలో సాక్షి మ్యాథ్స్ బీ విజయం సాధించింది. లెక్కలు సులువుగా నేర్చుకోవచ్చని ప్రశ్నపత్రం భరోసానిచ్చింది. తోటి విద్యార్థులతో పోటీ పడి హాజరు కావడం ద్వారా భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడంపై అవగాహన కలిగింది.

– సాయి దీక్షిత, 9వ తరగతి, విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్

సులువైన పద్ధతులు తెలిశాయి



గణితశాస్త్రంపై పట్టుకు మ్యాథ్స్ బీ ఉపయోగపడుతుంది. కఠినమైన లెక్కలను సులభంగా ఎలా చేయవచ్చో తెలిసింది. పరీక్షను ఎంతో ఉత్సాహంగా రాశాను. మార్కులు బాగా వస్తాయని భావిస్తున్నాను.

– మోహిత్‌సాయి, 8వ తరగతి, విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్

గణితంలో ప్రావీణ్యానికి దోహదం



సాక్షి మీడియా గ్రూప్ నిర్వహించిన మ్యాథ్స్ బీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. గణితంపై భయాన్ని దూరం చేసేందుకు కొత్త విధానాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన పరీక్ష ఆసక్తికరంగా సాగింది. ఇటువంటి పోటీ పరీక్షల వల్ల విద్యార్థుల మేధస్సు వృద్ధి చెందుతుంది.

– సురేష్, డైరెక్టర్, విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్



జంపని షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- జంపని షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయి వేతనాలు పంపిణీ

జంపని(వేమూరు): కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరు మండలంలోని జంపని షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు బకాయిల జీతాల చెక్కులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీలు నష్టాలు వల్ల మూతపడ్డాయని, జంపని షుగర్ ఫ్యాక్టరీ గత పది సంవత్సరాలు క్రితం మూడ పడిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికులు తమ వెతలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులకు జీతాలు బకాయిలు చెల్లించడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారన్నారు. అధికారం వచ్చి వెంటనే మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలపై కమిటీ వేశారన్నారు. చెప్పినవిధంగానే జంపని షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిల జీతాలు రూ.14.74 కోట్లు రావాల్సి ఉండగా, ప్రస్తుతం మొదటి విడత రూ 3.68 కోట్లు కార్మికులు అకౌంట్‌లలో జమ చేశారన్నారు. మిగిలిన రూ 11.6 కోట్లు త్వరలో చెల్లించడం జరుగుతుందని ఆయన తెలిపారు. చందోలు డేవిడ్ విజయకుమార్, గ్రామ సర్పంచ్ చుండూరు మరియమ్మ, ఎంపీపీ యల్లమాటి మోహన్, బొల్లిముంత ఏడుకొండలు, చంద్ర శేఖర్, ఎంపీటీసీలు, కార్మికులు పాల్గొన్నారు.

ఐఆర్‌సీటీసీ సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర

విజయవాడ : భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర పేరుతో ప్రత్యేక పర్యాటక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ నుంచి బయలుదేరే ఈ ప్రత్యేక పర్యాటక రైలు ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్ స్టేషన్‌లలో ఎక్కి, దిగేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈనెల 18 నుంచి 30 వరకు సాగే ఈ ప్రయాణంలో ఉజ్జయిని (మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర), స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ద్వారకా, సోమనాథ్, పూణే, నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ పుణ్యక్షేత్రాలను సందర్శించొచ్చన్నారు. ఈ ప్యాకేజీలో ఒక్కొక్కరికీ స్లీపర్ క్లాస్ రూ.21వేలు, థర్డ్ ఏసీకి రూ.32,500, సెకండ్ ఏసీకి రూ. 42,500గా నిర్ణయించారు. ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ ద్వారా కాని, విజయవాడ కార్యాలయం ఫోన్ నంబర్ల 9281495848, 9701360675 ద్వారా గానీ బుక్ చేసుకోవచ్చు.



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

అమరజీవి త్యాగఫలం అజరామరం

- నిర్దిష్ట విధానాలతో రాష్ట్రాభివృద్ధి
- అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం భేష్
- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- అట్టహాసంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, ఏఎస్పీ సుప్రజ

గుంటూరు వెస్ట్: అమరజీవి పొట్టి శ్రీరాములు లాంటి ఎందరో మహనీయుల త్యాగఫలం వల్లే మనం స్వేచ్ఛావాయువులను పీల్చగలుగుతున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతో అక్టోబర్ 1, 1953 సంవత్సరంలో కర్నూలు రాజధానిగా ప్రత్యేక రాష్ట్రంగా ఆంధ్ర ఏర్పడిందన్నారు. అనంతరం భాషా ప్రాతిపదికన తెలుగు మాట్లాడే వారి కోసం నవంబర్ 1, 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. ఇలా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేందుకు ఎందరో మహనీయులు చేసిన కృషి, త్యాగాల గురించి నేటి యువత తెలుసుకోవాలని చెప్పారు.

ప్రగతిపథాన జిల్లా

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోందని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలను గ్రామ స్థాయికి తీసుకొచ్చామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తక్కువ ధరకే అందిస్తున్నామని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా 14,542 మంది రైతులకు రూ.4.16 కోట్లు పరిహారం అందించామన్నారు. సూక్ష్మ సాగునీటి పథకం ద్వారా 740 సన్న, చిన్న కారు రైతులకు రూ.4.14 కోట్లు అందజేశామని పేర్కొన్నారు. వైద్య రంగంలో విప్లవాన్ని తీసుకొచ్చామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా 83,659 మందికి రూ.222 కోట్లతో శస్త్ర చికిత్సలు చేయించామని చెప్పారు. దీంతోపాటు 447 సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి 1.5 లక్షల మందికి వైద్య సేవలందించామని వెల్లడించారు. జిల్లాలో సుమారు 66 వేల మందికి ఇంటి స్థలాలు అందజేశామని పేర్కొన్నారు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమివ్వడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. పాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం భేష్ అని కొనియాడారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అడిషనల్ ఎస్పీలు సుప్రజ, కోటేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, శాసన సభ్యులు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, శాసన మండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, డెప్యూటీ మేయర్ షేక్ సజిల, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పఠాన్ ముంతాజ్, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, నెడ్‌క్యాప్ డైరెక్టర్ కొత్త చిన్నపరెడ్డి, ఏపీ టిడ్కో డైరెక్టర్ కె.నాగేశ్వరి, ఆర్‌అండ్‌బీ డైరెక్టర్ పిల్లిమేరి, జిల్లా అధికారులు అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిఘా పటిష్టం.. భద్రత కట్టుదిట్టం

- తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన పల్నాడు జిల్లా పోలీసులు
- 15 బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు
- ప్రతి వాహనం క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అనుమతి
- ఇప్పటివరకు 1,682 బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం
- 114 మంది రౌడీషీటర్లు బైండోవర్
- 101 మంది నుంచి వ్యక్తిగత ఆయుధాలు స్వాధీనం
- సరిహద్దు గ్రామాల్లో కార్డన్ సెర్చ్



తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్న మాచర్ల రూరల్ పోలీసులు

సాక్షి, నరసరావుపేట: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంతో సరిహద్దు పంచుకుంటున్న పల్నాడు పోలీసులు సరిహద్దులో భద్రతను కట్టుదిట్టం చేశారు. జిల్లా పోలీసులతో పాటు సరిహద్దు పోలీసులను సమన్వయం చేసుకుంటూ పహారా కాస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిర్వహించే మార్గాల్లో 24 గంటల పాటు డేగ కన్ను వేశారు. అక్రమమార్గంలో నగదు, మద్యం, వస్తువులు సరఫరా జరగకుండా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారు. చెక్ పోస్టుల వద్ద జరుగుతున్న తనిఖీల తీరును సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేసి కంట్రోల్ రూం ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. గత సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలు అంతర్ రాష్ట్ర సరిహద్దు సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు.

15 బోర్డర్ చెక్ పోస్టులు...

పల్నాడు జిల్లాకు సరిహద్దుగా ఉన్న సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు రాకపోకలు సాగించే తొమ్మిది పోలీసు శాఖ చెక్‌పోస్టులు, రెండు ఎక్సైజ్ శాఖ, మూడు అటవీశాఖ, రవాణా శాఖకు చెందిన ఒక చెక్ పోస్టులో 24 గంటలు సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. ఇందులో పోలీసుశాఖ సాగర్ వద్ద టీ రోడ్డు చెక్‌పోస్టు, పొందుగల, తంగెడ, సత్రశాల, పులిచింతల డ్యాం, మాదిపాడు, గోవిందాపురం, రేగులగడ్డ, అమరావతిలో చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటిలో అనుమతికి మించి నగదు, బంగారం, ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలోని వస్తువులు ఉంటే సంబంధిత పేపర్లు చూపమని అడుగుతున్నారు. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లే క్రమంలో సంబంధించిన ఆధారాలతో వెళ్లాలని పోలీసుశాఖ సూచిస్తోంది. లేనిపక్షంలో నగదు, వస్తువులను సీజ్ చేస్తున్నారు.


1,682 బాటిళ్ల మద్యం సీజ్...

పల్నాడు జిల్లా పోలీసు శాఖ చేపట్టిన తనిఖీలల్లో అక్రమ మద్యం పట్టుబడింది. 180 ఎంఎల్ మద్యం సీసాలు 1,469 , 750 ఎంఎల్ బాటిళ్లు 104, 375 ఎంఎల్ బాటిళ్లు 54, 500 ఎంఎల్ బాటిళ్లు 34, 650 ఎంఎల్ బాటిళ్లు 9, 275 ఎంఎల్ బ్రీజర్ బాటిళ్లు 12 సీజ్ చేశారు. అలాగే 185.5 లీటర్ల ఐడీ లిక్కర్, 4,100 లీటర్ల బెల్లం తేటను స్వాధీనం చేసుకున్నారు.

విస్తృతంగా కార్డన్ సెర్చ్..

పొరుగు రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో పల్నాడు పోలీసులు విస్తృతంగా కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలు, వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటికే దైద, విజయపురి సౌత్, కొత్త గంగరాజుపల్లి, గోవిందాపురం, సామదానంపేట గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అలాగే జిల్లాలోని 34 పోలీసుస్టేషన్ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఆయా గ్రామాల్లో కొత్తగా వచ్చిన, వారు నేర ప్రవృత్తి కలిగిన వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టిపెడుతున్నారు. జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలో 126 మంది గన్ లైసెన్స్ కలిగి ఉండగా తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో వాటిని సంబంధిత పోలీసు కార్యాలయాల్లో డిపాజిట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు 101 మంది తమ వ్యక్తిగత ఆయుధాలను పోలీసులకు అందజేశారు. మిగిలిన 25 మంది భద్రతా కారణాలతో షరతులతో ఆయుధాలు కలిగి ఉండటానికి అనుమతి ఇచ్చారు. మరోవైపు 91 మంది రౌడీషీటర్లు, 23 సస్పెక్ట్ షీటర్లను బైండోవర్ చేశారు.

ఎన్నికల నేపథ్యంలో చర్యలు తీసుకుంటున్నాం...



తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో డీజీపీ ఆదేశాలతో తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. సరిహద్దు చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేశాం. సరిహద్దు గ్రామాల్లో కార్డన్ సెర్చ్, పల్లెనిద్ర వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మాత్రమే సరిహద్దు దాటే సమయంలో నగదు, బంగారం, ఇతర వస్తువులను కలిగి ఉండాలి. లేనిపక్షంలో వాటిని సీజ్ చేస్తున్నాం. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– వై.రవిశంకర్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

అడిషనల్ ఎస్పీ సుప్రజ ఆకస్మిక తనిఖీలు

గుంటూరు ఈస్ట్: జిల్లా రేంజి ఐజీ పాలరాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సుప్రజ, వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, నగరంపాలెం ఎస్‌హెచ్‌ఓ హైమారావులు పెద్ద సంఖ్యలో సిబ్బందిని వెంటబెట్టుకుని బుధవారం రాత్రి నగరంలోని పలు కాలనీలను తనిఖీ చేశారు. నగరంపాలెం, ఆర్.అగ్రహారంలోని రామనామక్షేత్రం, ఎత్తురోడ్డు సెంటర్, లాలాపేట, పాత గుంటూరులలో అధికారులు, సిబ్బంది నడుచుకుంటూ వెళ్లి తనిఖీలు చేశారు. రాత్రి 10 గంటలు దాటిన తరువాత తెరిచి ఉంచిన షాపులపై కేసులు నమోదు చేశారు. 10 గంటలు దాటిన తరువాత షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నంబర్ ప్లేట్లు లేని 15 ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేశారు. పలుచోట్ల అడిషనల్ ఎస్పీ సుప్రజ స్థానిక మహిళలను పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలు పరిష్కరించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో నడుచుకుంటూ తనిఖీలు చేయడం నగరవాసులకు ఆసక్తి కలిగించింది.



గుంటూరు నగరంలో తనిఖీల సందర్భంగా మహిళలతో మాట్లాడుతున్న ఏఎస్పీ సుప్రజ

82,048 మందికి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు
- ఇళ్ల వద్దకే స్పెషాలిటీ వైద్యులు
- కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించారు
- గ్రామీణ ప్రాంతాల్లో ముగిసిన వైద్యశిబిరాలు


గుంటూరు నగరంలోని ఓ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

గుంటూరు మెడికల్: పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలోని ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాలు మంగళవారంతో ముగిశాయి. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 30 వరకు జిల్లా వ్యాప్తంగా 211 ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందించారు. నెలరోజులపాటు జిల్లా వ్యాప్తంగా 82,048 మంది వైద్యసేవలను పొందారు. వీరిలో పురుషులు 36,383 మంది, స్త్రీలు 45,665 మంది ఉన్నారు. వైద్యశిబిరాల్లో పరీక్షల అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం 2,339 మందిని టీచింగ్ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా....

ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే పేదలకు జేబులో నుంచి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య రంగంలో అనేక సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 3 వేలకు పైగా ప్రొసీజర్లకు ఉచిత వైద్య సేవలు అందించే అవకాశం కల్పించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఆసరా పథకంతో నెలానెలా డబ్బులు అందజేస్తూ చికిత్సల అనంతరం ఇళ్ల వద్ద ఉండి ఎలాంటి ఇబ్బంది పడకుండా భరోసా కల్పిస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేయడమేకాకుండా నూతనంగా పోస్టులు మంజూరు చేసి ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణాల్లో సైతం ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వైద్య సేవలు వైద్య పరీక్షలు సైతం ఉచితంగా అందిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ అనే నూతన ఆరోగ్య పథకం ద్వారా గ్రామీణులకు వైద్య సేవలు చేరువ చేశారు. సెప్టెంబర్ 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఇంటికీ ఉచిత వైద్య సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టారు.


మందులు తీసుకుంటున్న రోగులు

16,08,975 మంది సర్వే...

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని రెండు అర్బన్ పీహెచ్‌సీల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య బృందాలు ఇళ్లకు వెళ్లి ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్ యూరి, స్పుటమ్, అవసరాన్ని బట్టి మలేరియా, డెంగీ ఇలా పలు టెస్టులు చేశారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 2,67,026 ఇళ్లను, పట్టణ ప్రాంతాల్లో 3,51,905 ఇళ్లను, 16,08,975 మంది ప్రజలను సర్వేచేసి వారిలో ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి ఉచితంగా వైద్యసేవలు అందించారు. అధికరక్తపోటు పరీక్ష 6,48,079 మందికి, షుగర్ పరీక్ష 5,33,645 మందికి, హెచ్‌బీ (హిమోగ్లోబిన్) పరీక్ష 7,30,123 మందికి, యూరిన్ టెస్ట్ 6,695 మందికి, మలేరియా టెస్ట్ 3,742 మందికి, డెంగీ టెస్ట్ 928 మందికి, స్పూటం పరీక్ష 8,300 మందికి చేశారు.

107 మంది ఎంబీబీఎస్ వైద్యులు, 37 మంది స్పెషలిస్టులు

ప్రత్యేక వైద్య శిబిరాల్లో స్పెషాలిటీ వైద్యులను ప్రభుత్వం నియమించింది. జిల్లా వ్యాప్తంగా 107 మంది ఎంబీబీఎస్ వైద్యులు, 37 మంది స్పెషాలిటీ వైద్యులు వైద్య శిబిరాల్లో పాల్గొన్నారు. గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్యులు, నెఫ్రాలజిస్టులు, జనరల్‌సర్జన్లు, పిల్లల వైద్య నిపుణులు వైద్య శిబిరంలో వైద్య సేవలందించారు. వైద్య శిబిరాల్లో వైద్యులు రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులను అందజేసి ఆపరేషన్ అవసరమైన రోగులను ఆరోగ్య శ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు.

ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ పూర్తి ఉచితంగా సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజులపాటు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం. ఉచిత వైద్య శిబిరాల్లో ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేసి అవసరమైన వారికి ఆపరేషన్లు సైతం చేసేలా రిఫర్ చేశాం. ప్రజలు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య ఆరోగ్య శాఖ చరిత్రలో నూతన అధ్యయనానికి నాంది పలికింది. దేశ వ్యాప్తంగా ఎక్కడా కూడా ఇలాంటి బృహత్తర కార్యక్రమం ఇప్పటి వరకు జరుగలేదు.

–డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ

జీజీహెచ్‌లో వైద్య సేవలు భేష్

ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, వేదికపై డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు భేషుగా ఉన్నాయని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి అన్నారు. బుధవారం జీజీహెచ్ శుశ్రుత హాలులో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా జడ్జి పార్థసారథి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను డాక్టర్ కిరణ్ కుమార్ ఆవిష్కరించగా జిల్లా జడ్జి పార్థసారథి తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్య సేవలు కంటే కామన్ సెన్స్ వైద్యం మేలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు ఉన్నత వైద్యం అందుతోందన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆసుపత్రి పేద రోగులను ఆదుకుని ప్రాణాలను కాపాడిందన్నారు. గుంటూరు మెడికల్ కళాశాల, జీజీహెచ్‌కి ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కోసం ఎన్నో వైద్య పరికరాలను అందిస్తోందని, దాతలు అందిస్తున్న లక్షలాది రూపాయల విలువ గల పరికరాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. త్వరలో లివర్, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లో ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం గుండె ఆపరేషన్లు వారానికి ఒకసారి జరగడం నూతన ఒరవడికి శ్రీకారమని పేర్కొన్నారు. త్వరలో సిటీస్కాన్ మిషన్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశశ్వి, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వద్దాది వెంకట కిరణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయం


ఏఎన్‌యూలో నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య వరప్రసాదమూర్తి


ఎన్‌జీ రంగా వర్సిటీలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న రిజిస్ట్రార్ జి.రామారావు

వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: పొట్టి శ్రీరాములు జీవితం సదా ఆదర్శనీయమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బుధవారం జరిగిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వీసీ ప్రసంగిస్తూ పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకుని నేటితరం విద్యార్థులు లక్ష్యం వైపు పయనించి ఎన్ని కష్టాలు ఎదురైనా విజయాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య కె.గంగాధర్ రావు, ఆచార్య పి.జాన్సన్, ఆచార్య పి సిద్దయ్య, ఆచార్య ఈ.శ్రీనివాసరెడ్డి, ఆచార్య ఎ.ప్రమీల రాణి, దూరవిద్య కేంద్రం డైరెక్టర్, డాక్టర్ బి.నాగరాజు, పీజీ, యూజీ పరీక్షల కోఆర్డినేటర్లు ఆచార్య ఎల్ ఉదయ్ కుమార్, ఆచార్య సంధ్య కోలే తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో...

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో 68వ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు స్వాతంత్ర్య పోరాట యోధుడు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ డీన్ డాక్టర్ పి.సుధాకర్, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ పి. సాంబశివరావు, ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ పీ రవి, జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయస్థానం ఇచ్చే తీర్పులకు కట్టుబడి ఉండాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



మంగళగిరి: న్యాయస్థానాలు ఇచ్చే ఎటువంటి తీర్పులకైనా మనమంతా కట్టుబడి ఉండాల్సిందేనని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. చంద్రబాబు నాయుడు బెయిల్ మంజూరుపై బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నేతలు గానీ, చంద్రబాబు నాయుడు తరఫున న్యాయవాదులు గానీ అసలు స్కిల్ డెవలప్‌మెంట్‌లో కుంభకోణం జరగలేదని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు దోషి కాదని ఎక్కడా వాదనలు వినిపించలేదని గుర్తు చేశారు. రిమాండ్ సమయంలో చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగాలేదని ఆయన తరఫున న్యాయవాదులు అఫిడవిట్లు సమర్పించిన సందర్భంలో న్యాయమూర్తి చంద్రబాబు నాయుడు కంటి ఆపరేషన్ నిమిత్తం, లేక ఇతర అనారోగ్య కారణాలను ఆధారంగా చేసుకుని బెయిల్ మంజూరు చేశారన్నారు. అయితే ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ నేతలు మరిచిపోయినట్లు ఉన్నారని తాను భావిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబుకు వచ్చిన బెయిల్‌లో కొన్ని షరతులు విధించారని గుర్తుచేశారు. న్యాయమూర్తి, న్యాయస్థానం ఇచ్చిన షరతులకు అనుగుణంగానే చంద్రబాబు నడుచుకుంటారని, నడుచుకోవాలని తాను కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఏపీ పోలీస్ సర్వీస్ పతకాలు వీరికే...

నగరంపాలెం: ఏపీ పోలీస్ సర్వీస్ పతకాలకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ, అనుబంధ విభాగాల్లో విధులు నిర్వర్తించే వారు ఎంపికయ్యారు. వీరందరికీ త్వరలో ఆయా పతకాలను అందజేయనున్నారని పోలీస్ వర్గాలు తెలిపాయి. పతకాలు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి...

మహోన్నత సేవా పతకం: బి.సుబ్బారెడ్డి, ఆర్ఎస్ఐ, డీఏఆర్.

ఉత్తమ సేవా పతకం: షేక్.మస్తాన్‌సాహెబ్, ఆర్ఎస్ఐ డీఏఆర్, కె.దీక్షణమూర్తి ఏఆర్ఎస్ఐ, ఆరో బెటాలియన్, ఏపీఎస్పీ మంగళగిరి, కె.చంద్రశేఖర్ హెచ్‌సీ, పీటీఓ, మంగళగిరి.

కఠిన సేవా పతకం: టి.అప్పలస్వామి ఏఆర్ఎస్ఐ, వి.నాగరాజు హెచ్‌సీ, కె.ప్రవీణ్‌కుమార్ ఆర్ఐ , వి.శ్రీనివాసకుమార్ పీసీ ఏపీఎస్‌డీఆర్ఎఫ్, మంగళగిరి.

సేవాపతకం: ఎ.శ్రీనివాసరావు (క్రైం) ఏఎస్పీ, ఆర్.శివశంకరవరప్రసాద్, ఎస్ఐ, పీటీఓ మంగళగిరి.మహ్మద్‌గౌస్ షంషుద్దీన్ షరీఫ్ ఏఎస్ఐ, నల్లపాడు పీఎస్, కె.మాణిక్యరావు ఆర్ఎస్ఐ డీఏఆర్, జె.అంబేద్కర్ పీసీ నగరంపాలెం పీఎస్, సీహెచ్.శేఖర్‌బాబు హెచ్‌సీ పట్టాభిపురం పీఎస్, ఎం.వెంకటరమణ ఏఆర్ఎస్ఐ ఆరో బెటాలియన్ ఏపీఎస్పీ, మంగళగిరి, జె.కోండయ్య హెచ్‌సీ ఆరో బెటాలియన్ ఏపీఎస్పీ మంగళగిరి, జి.ఏడుకొండలు, ఏఎస్ఐ ఇంటిలిజెన్స్, బి.శ్రీనివాసరావు హెచ్‌సీ కంట్రోల్ రూం సీబీడీ, మంగళగిరి, ఎస్.చంద్రశేఖర్ బాబు పీసీ పీసీఎస్/ఎస్, మంగళగిరి, ఎ.ప్రతాప్‌రెడ్డి, హెచ్‌సీ, పీటీఓ, మంగళగిరి.

ఏపీ స్టేట్ పోలీస్ సేవా పతకం ఎంపికైన వారిలో కె.ఈశ్వరరావు, గుంటూరు రీజియన్ విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ, షేక్.అబ్దుల్ రహీం, హెచ్‌సీ, గుంటూరు రీజియన్ విజిలెన్స్/ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సులపై అవగాహన

బాపట్ల అర్బన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆఫర్ చేస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులను అర్హులైన వారికి అందుబాటులో తెచ్చినట్లు ప్రకాశం, బాపట్ల జిల్లాల డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ బిజ్జం శ్రీనివాసులు రెడ్డి బుధవారం తెలిపారు. బాపట్ల పట్టణంలోని సాల్వేషన్ ఆర్మీ విలియంబూత్ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులపై అవగాహన కల్పించారు. విద్యను మధ్యలో మానేసినవారు, ఉద్యోగాలు చేసుకుంటున్నా వారు, గృహిణులకు తక్కువ ఫీజులతో ఓపెన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రిన్సిపాల్ మేడికొండ సునీల్, ఎంఐఎస్ లలిత, క్యూటీమ్ హెడ్ శశిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పారదర్శక ఓటరు లిస్టుకు సహకరించండి

గుంటూరు వెస్ట్: అర్హులైన వారందరికీ ఓటు హక్కు అందించాల్సిన ప్రధాన బాధ్యత మనపై ఉందని, దీనికి ప్రజాప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్–2024 సంబంధించి గత నెల 27న ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను తెలపాలన్నారు. దీనికి ఆఖరు తేదీ డిసెంబర్ 9 అని చెప్పారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి క్లెయిమ్స్ స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యంతరాల్లో ఒకే ఇంటి నెంబరుపై 10 మంది కంటే ఎక్కువ సభ్యులున్నా వివరాలు సేకరిస్తామన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ తనిఖీలు ప్రజాప్రతినిధుల సమక్షంలో విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇప్పటి వరకు 4,365 బ్యాలెట్ యూనిట్స్, 3,525 కంట్రోల్ యూనిట్స్ 3,973 వీవీప్యాట్‌లు పరిశీలించామన్నారు. వీటిలో 43 బ్యాలెట్ యూనిట్స్, 28 కంట్రోల్ యూనిట్స్, 17 వీవీప్యాట్‌లు తిరస్కరించామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ సుజాత పాల్గొన్నారు.

మేనమామ-మేనకోడలు దుర్మరణం

- వారధి వద్ద బలితీసుకున్న టిప్పర్ లారీ
- మృతులిద్దరూ కృష్ణా జిల్లా ముదినేపల్లి వాసులు


మృతి చెందిన దేగల సుబ్బారావు


మృతి చెందిన దాసరి విజయదుర్గ

తాడేపల్లిరూరల్: కనకదుర్గ వారధి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మేనమామ, మేనకోడలు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరిబాబు కథనం ప్రకారం కృష్ణాజిల్లా ముదినేపల్లికి చెందిన దేగల సుబ్బారావు (50), దాసరి విజయదుర్గ (28) వీరిద్దరు తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్న బంధువుని పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అయితే వారధి దాటిన తరువాత వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో దేగల సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందగా, దాసరి విజయదుర్గను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

గురజాల డీఎస్పీ పల్లపురాజుకు ఉత్తమ సేవా పతకం



నరసరావుపేట: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సేవాపతకాల్లో జిల్లాలో ఉత్తమ సేవా పతకం ఒకరికి లభించగా, మరో ఇద్దరు సేవా పతకాలు అందుకున్నారు. ఉత్తమ సేవా పతకం గురజాలకు చెందిన డీఎస్పీ ఆకురాతి పల్లపురాజుకు లభించగా, మరికొందరికి సేవా పతకాలకు ఎంపికయ్యారు. జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సిబ్బందిని అభినందించారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం


కాపు వసతి గృహ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు


తెలగ అభ్యుదయ సంఘం నాయకులను అభినందిస్తున్న అంబటి మురళీకృష్ణ

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- గోరంట్లలో 300 పడకల కాపు వసతి గృహం ప్రారంభం

గుంటూరు రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. బుధవారం గోరంట్ల గ్రామంలో నూతనంగా తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 300 పడకల రఘుపతి వెంకటరత్నం నాయుడు కాపు విద్యార్థి వసతి గృహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా కాపు విద్యార్థి వసతి గృహాన్ని ఏర్పాటు చేసిన తెలగ అభ్యుదయ సంఘాన్ని అభినందించారు. తెలగ అభ్యుదయ సంఘం కార్యదర్శి బాలిశెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ అనేక మంది కాపు, తెలగ, బలిజ, ఒంటరి విద్యార్థుల విద్యాభివృద్ధికి వసతి గృహాన్ని ఏర్పాటుకు కృషిచేసిన ప్రతి కాపు, బలిజ, తెలగ, ఒంటరి నాయకులకు ప్రారంభోత్సవానికి వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, గుంటూరు మిర్చియార్డ్ డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వర్లు (ఇంద్ర) తదితరులు పాల్గొన్నారు.

తెలగ అభ్యుదయ సంఘానికి అభినందనలు

కాపు విద్యార్థులకోసం నూతనంగా 300 పడకలతో గోరంట్ల గ్రామంలో కాపు విద్యార్థి వసతి గృహాన్ని ఏర్పాటు చేసిన తెలగ అభ్యుదయ సంఘానికి అభినందనలు తెలుపుతున్నానని అంబటి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం నూతంగా ప్రారంభోత్సవాన్ని జరుపుకుంటున్న కాపు వసతి గృహాన్ని ఆయన సందర్శించి తెలగ అభ్యుదయ సంఘం నాయకులను అభినందించారు. కార్యక్రమంలో అభ్యుదయ సంఘం నాయకులు తదితరులు న్నారు.